ఆదివారం 02-6-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 352, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

Telangana Exit Polls

BJP: 08-09
Cong: 07-08
BRS: 01-02
MIM: 0-1

MUNDADUGU

## తెలంగాణలో బిజెపిదే జోరు

వివరాలు 3లో



## ఎగ్జిట్ పోల్స్ ఎంత వరకు నిజం..?

వివరాలు 4లో



## అరగంటకుపైగా ట్రాఫిక్‌లో కేసీఆర్

వివరాలు 4లో

# రేవంత్‌రెడ్డికి కేసీఆర్ 22 పేజీల లేఖ

### అమరుల త్యాగాల పర్యవసానమే తెలంగాణ ▪ కాంగ్రెస్ దయాభిక్షగా తెలంగాణ రాలేదు

**ముందడుగు తెలంగాణ:**

బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి 22 పేజీల సుదీర్ఘ లేఖ రాశారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలకు రావాలని ఆహ్వానం పంపిన నేపథ్యంలో ప్రజల పక్షాన బహిరంగ లేఖ రాస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ సుదీర్ఘ ప్రజా పోరాట ఫలితం.. అమరుల త్యాగాల పర్యవసానం. కానీ, కాంగ్రెస్ దయాభిక్షగా మీరు చేస్తున్న ప్రచారాన్ని నిరసిస్తున్నాను. 1969 నుంచి ఐదు దశాబ్దాలు, భిన్నదశలలో, భిన్న మార్గాలలో ఉద్యమ ప్రస్థానం సాగింది. తెలంగాణ ఉద్యమాన్ని కాంగ్రెస్ రక్తసిక్తం చేసిందనేది మీరు దాచేస్తే దాగని సత్యం. 1952 ముల్కీ ఉద్యమంలో సిటీ కాలేజీ విద్యార్థులపై కాల్పులు జరిపి నలుగురు విద్యార్థుల ప్రాణాలు పొట్టన పెట్టుకున్నది ఆదిగా.. కాంగ్రెస్ క్రూర చరిత్ర కొనసాగింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవం ఒక ఉద్విగ్న, ఉత్తేజకరమైన సందర్భమే. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని తిరోగమన దిశగా తీసుకుపోతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతోన్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉత్సవాల్లో కేసీఆర్ పాల్గొనడం సమంజసం కాదని భారాస, తెలంగాణ వాదుల అభిప్రాయంగా ఉంది'' అని కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు.



## కేంద్రంలో మళ్లీ మోడీదే హవా...?

- అన్ని ఎగ్జిట్ పోల్స్ ఫలితాల్లో బిజెపికే మొగ్గు
- దక్షిణ భారత రాష్ట్రాల్లో బీజేపీ ప్రభంజనం

వివరాలు 2లో

## పోరు తెలంగాణ నా పోరు తెలంగాణ...

వివరాలు 2లో

## పాక్ ఆక్రమిత కశ్మీర్ విదేశీ భూభాగమే

- ఇస్లామాబాద్ హైకోర్టులో అంగీకరించిన పాకిస్థాన్
- పాక్ మిలటరీ ఎందుకు చొరబడుతోందని కోర్టు చురక

**ముందడుగు జాతీయం:**

పాకిస్థాన్ ప్రభుత్వం ఇస్లామాబాద్ హైకోర్టులో పాక్ ఆక్రమిత కశ్మీర్ విదేశీ భూభాగమని అంగీకరించింది. అక్కడ పాకిస్థాన్ చట్టాలు చెల్లబోవని చెప్పింది. పాత్రికేయుడి కిడ్నాప్ కేసుపై శుక్రవారం విచారణ సందర్భంగా పాకిస్థాన్ అదనపు అటార్నీ జనరల్ ఇస్లామాబాద్ కోర్టులో ఈమేరకు వ్యాఖ్యానించారు. రావల్పిండిలోని తన ఇంట్లో ఉన్న అహ్మద్ మిగతా 2లో




## నేడు తీహార్ జైలుకు కేజ్రీవాల్

- మధ్యంతర బెయిల్‌పై దక్కని ఊరట
- తీర్పును జూన్ 5కు వాయిదా వేసిన ఢిల్లీ కోర్టు

**ముందడుగు ఢిల్లీ:**

ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఊరట దక్కలేదు. ఆయన మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ కోర్టు జూన్ 5న నిర్ణయం తీసుకోనుంది. ఆ రోజు తీర్పు వెలువరించనుంది. దీంతో కేజ్రీవాల్ నేడు జైలు అధికారుల ముందు లొంగిపోవాల్సిఉంది.

మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తన అరెస్టును సవాల్



చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దానిపై విచారణ ఆలస్యమవుతుండటంతో ఎన్నికల్లో మిగతా 2లో

ముందడుగు
ఆదివారం, 02-6-2024, హైదరాబాద్

# పాక్ ఆక్రమిత కశ్మీర్ విదేశీ భూభాగమే

**మొదటిపేజీ తరువాయి**

ఫర్హద్ షా అనే పాత్రికేయుడిని పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ సంస్థ మే 15న కిడ్నాప్ చేసింది. దీనిపై ఆయన భార్య అక్కడి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

దీనిపై జస్టిస్ మోసిన్ అక్తర్ కయాని నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. అహ్మద్ ఫర్హద్‌ను కోర్టు ఎదుట ప్రవేశపెట్టాలని ఆదేశించింది. ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన అదనపు అటార్నీ జనరల్.. ప్రస్తుతం అహ్మద్ 'పీవోకే'లో పోలీస్ కస్టడీలో ఉన్నట్లు కోర్టుకు తెలిపారు. అది విదేశీ భూభాగమని, అక్కడ ప్రత్యేక రాజ్యాంగం, చట్టాలు ఉంటాయని, పాకిస్థాన్ చట్టాలు చెల్లబోవని చెప్పారు. అందువల్ల అతడిని కోర్టు ఎదుట ప్రవేశపెట్టడం కుదరదని వివరించారు. దీనిపై స్పందించిన జస్టిస్ కయానీ ఒకవేళ పీవోకే విదేశీ భూభాగమైతే.. పాకిస్థాన్ రేంజర్లు, పాక్ మిలటరీ ఎందుకు ఆ ప్రాంతంలోకి చొరబడుతున్నారని చురకలంటించింది. సామాన్యులను విచారణ పేరుతో ఇంటెలిజెన్స్ సంస్థలు బలవంతంగా నిర్బంధించడాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. మరోవైపు పాక్ న్యాయవాది వ్యాఖ్యలతో భారత్‌కు మరింత బలం చేకూరినట్లయింది. 'పీవోకే' భారత్‌లో అంతర్భాగమని, అది 1947 నుంచి పాక్ ఆక్రమణలో ఉందని భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ ఎప్పటికప్పుడు చెబుతూనే ఉన్నారు. పీవోకే ఎప్పటికీ భారత్‌తోనే ఉంటుందని, అది భారత్‌లోనే ఉంటుందని వివిధ సందర్భాల్లో ఆయన నొక్కి చెప్పారు.

# నేడు తీహార్ జైలుకు కేజ్రీవాల్

**మొదటిపేజీ తరువాయి**


ప్రచారం కోసం చేసిన అభ్యర్థనను అంగీకరిస్తూ..కోర్టు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ ఇచ్చింది. జూన్ 2న తిరిగి జైలుకు వెళ్లాలని ఆదేశించింది. శనివారంతో ఆ బెయిల్ గడువు ముగిసింది. ఈ నేపథ్యంలోనే బరువు తగ్గడం, కిడ్నీ సమస్యలకు సంబంధించి వైద్య పరీక్షలు చేయించుకోవడానికి మధ్యంతర బెయిల్‌ను మరో ఏడు రోజుల పాటు పొడిగించాలని కేజ్రీవాల్ ఢిల్లీ కోర్టును ఆశ్రయించారు. దానిపై శనివారం విచారణ జరిగింది. విచారణ సమయంలో కేజ్రీవాల్‌కు ఈడీ బెయిల్ వ్యతిరేకించింది. ఆయన వాస్తవాలను తొక్కిపట్టి, తన ఆరోగ్యంతో సహా పలు విషయాల్లో తప్పుడు ప్రకటనలు చేశారని దర్యాప్తు సంస్థ తరపు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. ఆరోగ్య కారణాలతో బెయిల్ ఇవ్వాలని సీఎం తరపు న్యాయవాది కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు.. తీర్పును జూన్ 5కు వాయిదా వేసింది.

# రామనామ స్మరణతో ఆలయాలు

## కొండగట్టుకు పోటెత్తిన భక్తులు

**ముందడుగు కరీంనగర్:**

పెద్ద హనుమాన్ జయంతి నేపథ్యంలో కొండగట్టు అంజన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. హనుమాన్ దీక్ష విరమణ కోసం రాష్ట్ర నలుమూలల నుంచి మాలదారులు తరలిరావడంతో రద్దీ నెలకొంది. రామనామ స్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగుతున్నాయి.



ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి భక్తులు దీక్ష విరమణకు తలరివస్తున్నారు. ఇప్పటికే ఆలయానికి చేరుకున్న వారు అంజన్నను దర్శించుకుని, దీక్షను విరమిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం వరకు దీక్షాపరుల రద్దీ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. కాగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. ఉత్సవాలను జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా పరిశీలించారు.

# కేంద్రంలో మళ్లీ మోడీదే హవా...?

## అన్ని ఎగ్జిట్ పోల్స్ ఫలితాల్లో బిజెపికే మొగ్గు ▪ దక్షిణ భారత రాష్ట్రాల్లో బీజేపీ ప్రభంజనం

**ముందడుగు జాతీయం:**



దేశంలో మరోసారి నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తాయని.. దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ ఫలితాల్లో వెల్లడైంది. ఈ నేపథ్యంలోనే కేంద్రంలో బీజేపీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని స్పష్టం అవుతోంది. ఈ క్రమంలోనే ఇప్పటివరకు ఉత్తర భారతదేశంలోని రాష్ట్రాల్లో బీజేపీ హవా కొనసాగుతుండగా.. ఈసారి దక్షిణ భారత రాష్ట్రాల్లో కూడా బీజేపీ ప్రభంజనం సృష్టిస్తుందని ఎగ్జిట్ పోల్స్ ఫలితాల్లో వెల్లడి అవుతోంది. దక్షిణాదిలో బీజేపీకి కేవలం ఒక్క కర్ణాటకలో మాత్రమే పట్టు ఉండగా.. తెలంగాణలో కాస్త సీట్లు సాధించేది. ఇక తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 2019 లో కనీసం కమలం పార్టీ ఖాతా కూడా తెరవకపోవడం గమనార్హం. అయితే ఈ ఎన్నికల్లో మాత్రం బీజేపీ ఈ 3 రాష్ట్రాల్లో బోణీ కొట్టబోతోందని సర్వే సంస్థలు అంచనా వేస్తున్నాయి. 2019 లో దక్షిణ భారత రాష్ట్రాల్లో 29 సీట్లు సాధించగా.. ఈసారి ఆ సంఖ్య 36 నుంచి 39 స్థానాలకు పెరుగుతుందని ఎగ్జిట్ పోల్స్ అంచనాల్లో వెల్లడవుతోంది. కర్ణాటకలో బీజేపీ జేడీఎస్ కలిపి ఎన్డీఏ కూటమిగా పోటీ చేస్తుండగా.. ఆ ఒక్క రాష్ట్రంలోనే 23 నుంచి 26 సీట్లు సాధిస్తుందని న్యూస్ 18 ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడైంది. ఒక్క బీజేపీనే కర్ణాటకలో 21 నుంచి 24 సీట్లు గెలుస్తుందని.. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ 3 నుంచి 7 స్థానాల్లో విజయం సాధించనుందని పేర్కొంది.

తమిళనాడు విషయానికి వస్తే.. డీఎంకేకాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి 36 నుంచి 39 స్థానాల్లో విజయం సాధించనుందని న్యూస్ 18 ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడైంది. 2019 ఎన్నికల్లో తమిళనాడులో ఉన్న మొత్తం 39 సీట్లకు గానూ డీఎంకే ఒంటరిగా 38 స్థానాల్లో గెలుపొందింది. అయితే ఈసారి తమిళనాడులో బీజేపీ పాగా వేయనుందని.. ఆ పార్టీ 1 నుంచి 3 సీట్ల వరకు గెలిచే అవకాశాలు ఉన్నాయని న్యూస్ 18 ఎగ్జిట్ పోల్స్ వెల్లడించింది.

ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన, బీజేపీలతో కూడిన ఎన్డీఏ కూటమి 19 నుంచి 22 స్థానాలు గెలుచుకోనుందని న్యూస్ 18 ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడైంది. తెలంగాణలో కూడా బీజేపీ హవా కొనసాగనుందని అంచనా వేసింది. తెలంగాణలో బీజేపీకి 7 నుంచి 10 సీట్లు వస్తాయని పేర్కొంది. ఈ క్రమంలోనే 2019 లో దక్షిణ భారత రాష్ట్రాల్లోని కర్ణాటక, తెలంగాణలో మాత్రమే బీజేపీకి సీట్లు రాగా.. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో కనీసం ఖాతా కూడా తెరవలేకపోయింది. దీంతో అప్పటి నుంచి దక్షిణాదిపై ఫోకస్ పెట్టిన బీజేపీ, నరేంద్ర మోదీ.. అనేక పర్యటనలు చేసి.. సీట్లను పెంచే ప్రయత్నం చేశారు.

# కౌంటింగ్ కేంద్రాల వద్ద నాలుగు అంచెల భద్రత

▪ ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు
▪ మీడియా సమావేశంలో సీఈవో వికాస్ రాజ్

**ముందడుగు హైదరాబాద్:**

లోక్ సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈ నెల 4న ఉదయం 8 గంటలకు మొదలవుతుందని సీఈవో వికాస్ రాజ్ వెల్లడించారు. మొదట పోస్టల్ బ్యాలెట్స్ లెక్కింపు ఉంటుందని 8.30 గంటలకు ఈవీఎంల ఓట్ల లెక్కింపు షురూ అవుతుందని ప్రకటించారు. హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల వద్ద నాలుగు అంచెల భద్రత ఉంటుందని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకువెళ్లేందుకు అనుమతి ఉండదని సీఈవో స్పష్టం చేశారు. కౌంటింగ్ ఏజెంట్లు, సిబ్బందికి సైతం సెల్‌ఫోన్స్ అనుమతి ఉండవని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోని ప్రతి మూలను కవర్ చేసేలా





సీసీ కెమెరాల నిఘా ఉంటుందని.. స్ట్రాంగ్ రూం నుంచి లెక్కింపు కేంద్రం వరకు బారికేడ్లు, పటిష్ట భద్రత ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 2.17 లక్షల పోస్టల్ బ్యాలెట్స్ వచ్చాయని చెప్పారు. ఈ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు 276 టేబుల్స్‌ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడు అసెంబ్లీ సెగ్మెంట్లలో అత్యధికంగా 24 రౌండ్లలో లెక్కింపు ఉంటుందని.. మరో మూడు అసెంబ్లీ సెగ్మెంట్లలో అత్యల్పంగా 13 రౌండ్ల లెక్కింపు వికాస్ రాజ్ తెలిపారు.

# ఇంటి పెద్ద మరణించినా దుఃఖంతో ఓటేశారు

## ఓటేసి ఆదర్శంగా నిలిచిన కుటుంబం

**ముందడుగు బిహార్:**

ఇంటి పెద్ద కన్నుమూసినా.. కుటుంబంలోని అందరూ ఓటు వేశాకే అంత్యక్రియలకు సిద్ధమైంది ఒక కుటుంబం. బాధ్యతను మరవని ఆ కుటుంబం ఎంతోమందికి ఆదర్శంగా నిలిచింది. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బిహార్‌లో నేడు పోలింగ్ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే జెహనాబాద్ నియోజకవర్గంలోని దేవ్‌కురి గ్రామంలో ఓ కుటుంబంలో విషాదం చోటుచేసుకొంది. ఒకవైపు ఎన్నికల పండగ జరుగుతుండగా.. మరోవైపు మిథిలేశ్ యాదవ్ (గ్రామస్థుడు) తల్లి (80 ఏళ్లు) ప్రాణాలు కోల్పోయింది. ఇంటి పెద్దను కోల్పోయి దుఃఖంలో ఉన్నా ఆ కుటుంబం తమ బాధ్యతను మరవలేదు. దీంతో కుటుంబసభ్యులంతా



ఒక నిర్ణయానికి వచ్చారు. ఓటుహక్కు వినియోగించుకున్న తరువాతే ఆమె అంత్యక్రియలు నిర్వహించాలనుకున్నారు. వారు తీసుకున్న ఈ నిర్ణయం ఎంతోమందికి ప్రజాస్వామ్య ప్రాధాన్యాన్ని తెలియజేసిందనడంలో అతిశయోక్తి లేదు. కాగా.. చివరి విడతలో భాగంగా 57 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ కొనసాగుతోంది. బిహార్‌లోని ఎనిమిది స్థానాలకు నేడు ఓటింగ్ జరుగుతోంది.

ముందడుగు
ఆదివారం, 02-6-2024, హైదరాబాద్

# ప్రాణం తీసిన ఒక్క రూపాయి గొడవ

## వరంగల్ మిల్స్ కాలనీ పరిధిలో ఘటన



**ముందడుగు వరంగల్:**

ఒక్క రూపాయి కోసం ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణ ఓ వ్యక్తి ప్రాణాలు తీసింది. రూపాయి కారణంగా జరిగిన వివాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన వరంగల్ నగరంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ మిల్స్ కాలనీ పరిధిలోని గాంధీనగర్ లో.. ప్రేమ్ సాగర్ అనే వ్యక్తి ఆటో నడుపు కొంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి గాంధీనగర్లోని ఓ బిర్యానీ పాయింట్ వద్ద ఆగి బిర్యానీ కొనుగోలు చేశాడు. అదే సమయంలో అక్కడికి అరవింద్ అనే యువకుడు వచ్చాడు.

బిర్యానీ రూ.59 కాగా.. ప్రేమ్ సాగర్ రూ.60 ఫోన్ పే చేశాడు. ఈ క్రమంలో అరవింద్ రూపాయి విషయంలో ప్రేమ్ సాగర్ ను ఎగతాళి చేయగా.. ఇరువురి మధ్య వివాదం నెలకొంది. ఒకరిపై ఒకరు పిడిగుద్దులు కురిపించుకున్నారు. క్షణికావేశంలో ప్రేమ్ సాగర్ను నెట్టేయడంతో కింద ఉన్న రాయి తగిలి అతని తలకు బలమైన గాయమైంది. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. ప్రేమ్ సాగర్తో గొడవ పడ్డ అరవింద్ పరారీలో ఉండగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణలో బిజెపిదే జోరు


## • రెండవ స్థానంలోనే కాంగ్రెస్ పార్టీ
## • ముందడుగు సర్వే ఫలితాలు విడుదల

**ముందడుగు తెలంగాణ:**

తెలంగాణలో బీజేపీ జోరు చూపిందని సర్వేలు చెబుతున్నాయి. ముందడుగు ఎగ్జిట్ పోల్స్ ప్రకారం.. తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన లోక్సభ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటిందని పేర్కొంది. తెలంగాణలో మెజార్టీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకొనుంది. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీకి ఒకటి లేదా రెండు సీట్లు దక్కే అవకాశం ఉందని తేల్చేసింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రెండవ స్థానంలో నిలవనుంది.

### తెలంగాణలో ముందడుగు ఫలితాలు:

**బీజేపీకి 8 నుంచి 9 సీట్లు**
**కాంగ్రెస్ పార్టీకి 7 నుంచి 8 సీట్లు**
**బిఆర్ఎస్ పార్టీకి 01 నుంచి 02 సీట్లు**
**ఎంఐఎం పార్టీకి ఒక్క స్థానం**




ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి అధికారం కోల్పోయిన కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి మరింత దారుణంగా ఉందని తెలుస్తోంది. దీంతో తెలంగాణ లోక్సభ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు బీఆర్ఎస్ పార్టీకి నిరాశ కలిగించేలా ఉన్నాయి. ఏది ఏమైనా జూన్ 4న విడుదలయ్యే అసలైన ఫలితాల కోసం అందరూ వేచి చూడాల్సిందే.

## ఇంటీరియర్ డిజైన్‌లో అత్యుత్తమ ప్రతిభావంతులకు

# ఎక్సలెన్స్ అవార్డ్స్ 2024




**ముందడుగు హైదరాబాద్:**

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఇంటీరియర్ డిజైన్ రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అత్యుత్తమ ప్రతిభావంతులకు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ హైదరాబాద్ రీజినల్ చాప్టర్ వార్షిక ఈవెంట్ లో భాగంగా ఎక్సలెన్స్ అవార్డ్స్ 2024 పేరిట ఘనంగా సత్కరించారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్ పార్క్ హయత్ హోటల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కిమ్స్ హాస్పిటల్స్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి.భాస్కర్‌రావు హాజరయ్యారు. ఇంటీరియర్ డిజైనర్లు ప్రదర్శించిన సృజనాత్మకత, ఆవిష్కరణ మరియు శ్రేష్ఠతను హైలైట్ చేస్తూ 14 విభిన్న విభాగాల్లో 42 మందికి అవార్డులు అందించారు. ఇద్దరు ప్రముఖ నిపుణులు, ఏఆర్. అపర్ణ బిదార్కర్ మరియు సుప్రజా రావు, ఇంటీరియర్ డిజైన్ రంగానికి చేసిన విశేష కృషికి వారిని సత్కరించారు. ఈ సందర్భంగా డా. భాస్కర్ రావ్ మాట్లాడుతూ ఇంటీరియర్ డిజైనర్ల వలన హైదరాబాద్ మహా నగరానికి ప్రపంచవ్యాప్తంగా గొప్ప పేరు వచ్చిందని అన్నారు. ఐఐఐడి హెఆర్సీ చైర్‌పర్సన్ ఏఆర్. పల్లవి అంచూరి మాట్లాడుతూ ఐఐఐడి హెచ్ఆర్సీ డిజైన్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2024 తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్‌లోని ఇంటీరియర్ డిజైన్ కమ్యూనిటీ యొక్క అపారమైన ప్రతిభ మరియు అంకితభావానికి నిదర్శనం" అని అన్నారు. ఈ వార్షిక ఈవెంట్ చాలా మంది డిజైనర్లకు వారి వినూత్న ఆలోచనలను కొనసాగించే వేదికగా మారింది అన్నారు.

# వేడుకలపై కేసీఆర్‌కు గౌరవం లేదు

## ▪ 22 పేజీల లేఖ రాయడం ఏంటి
## ▪ మీడియాతో చిట్‌చాట్‌లో రేవంత్ రెడ్డి

**ముందడుగు తెలంగాణ:**




బిఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలపై గౌరవం లేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మాజీ సీఎం, ఉద్యమకారుడని గుర్తించి వేడుకలకు ఆహ్వానిస్తే 22 పేజీల లేఖ రాయడం ఏంటని ప్రశ్నించారు. మీడియాతో చిట్ చాట్‌లో మాట్లాడుతూ ''ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సోనియాగాంధీని ఆహ్వానించేందుకు కూడా అనుమతి తీసుకోవాల్సి వచ్చింది. భారాస నాయకులు అమరవీరుల స్థూపం వద్దకు వెళ్లాలంటే ఈసీ అనుమతి తీసుకోవాల్సి ఉంది. స్థూపం వద్ద కంచె వేయాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదు. రాష్ట్ర గీతంపై ఏ విధంగా అభిప్రాయాలు తీసుకుని నిర్ణయం తీసుకున్నామో...చిహ్నం విషయంలో కూడా అదే చేస్తాం. రాష్ట్ర అవతరణ ఉత్సవాలకు భారాస, భాజపా నాయకులకు ఆహ్వానం పంపించాం. ఎవరినీ విస్మరించలేదు.

గీతాలాపనలో వ్యక్తులకు ప్రాధాన్యత లేదు. అందరూ కలిసి పాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఈ గీతం కీలకపాత్ర పోషించింది. దాన్ని రాజకీయం చేయాలని మాకు లేదు. గీతాన్ని పాడించే బాధ్యత అందెశ్రీకి అప్పగించాం.. అంతటితో నా బాధ్యత తీరింది. రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేవు.. అంతరాయాలు మాత్రమే ఉన్నాయి. వివిధ కారణాలతో ఈ అంతరాయాలు ఏర్పడుతున్నట్లు ప్రభుత్వ పరిశీలనలో వెల్లడైంది. భారాసతో కుమ్మక్కైన కొందరు కావాలనే విద్యుత్తు సరఫరా ఆపుతున్నారు. ఇటీవల ఒక సంఘటన వెలుగులోకి వచ్చింది. విచారణ చేయించి చర్యలు తీసుకుంటాం. వేసవి కారణంగా ఇటీవల ఓ రోజు 298 మిలియన్ యూనిట్ల వినియోగం నమోదైంది. సామర్థ్యానికి మించి విద్యుత్ వాడకం ఉన్నప్పుడు.. లైన్‌లు ట్రిప్ అయ్యి అంతరాయం ఏర్పడుతుంది. సరఫరాలో ప్రభుత్వం వైఫల్యం చెందినట్లు చూపాలని కొందరు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే అధికారులతో సమీక్ష నిర్వహించి పరిస్థితిని చక్కబెడతాం.

# అరగంటకుపైగా ట్రాఫిక్‌లో కేసీఆర్

## లక్డీకపూల్ వద్ద స్తంభించిన ట్రాఫిక్

**ముందడుగు హైదరాబాద్:**



తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అరగంటకుపైగా ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్నారు. శనివారం సాయంత్రం లక్డీకపూల్ వద్ద భారీగా ట్రాఫిక్ స్తంభించింది. గన్‌పార్క్ దగ్గర తన కోసం వేచి చూస్తున్న పార్టీ నేతల వద్దకు బంజారాహిల్స్ నందీనగర్ నుంచి బయల్దేరి వెళ్లగా లక్డీకపూల్ ట్రాఫిక్‌లో ఆయన చిక్కుకున్నారు.

తెలంగాణ దశాబ్ది ఉత్సావ వేడుకలను ఘనంగా నిర్వహించడానికి బీఆర్ఎస్ సిద్ధమైంది. 10 ఏళ్లుగా అధికార పార్టీ హోదాలో వేడుకలు నిర్వహించగా.. రాష్ట్ర ఆవిర్భావం తరువాత తొలిసారి ప్రతిపక్ష హోదాలో కార్యక్రమం జరుపుతోంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కేసీఆర్ పాల్గొననుండటంతో ఆ పార్టీ శ్రేణులు భారీగా గన్‌పార్క్ వద్దకు చేరుకున్నారు. గన్‌పార్క్ నుంచి సచివాలయం వద్ద ఉన్న అమరవీరుల స్మారక చిహ్నం వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి వస్తుండగానే కేసీఆర్ లక్డీకపూల్ ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు.

# మా కూటమి 295కు పైగా సీట్లు గెలుస్తోంది

- ■సర్వే ప్రకారం ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాం
- ■కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధీమా

**ముందడుగు జాతీయం:**



సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి 295కు పైగా సీట్లు గెలుచుకోనుందని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధీమా వ్యక్తం చేశారు. కూటమిలోని కీలక నేతలతో తన నివాసంలో భేటీ అయిన ఖర్గే ఎన్నికలపై చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

"లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి 295కు పైగా స్థానాలు గెలుచుకుంటుంది. ఫలితాల్లోనూ ఇదే వెల్లడవుతుంది. మా కూటమిలోని నేతలు ప్రజల్లోకి వెళ్లి సర్వే నిర్వహించారు. వారితో రెండు గంటలకు పైగా చర్చలు జరిపాం. సర్వే ప్రకారం ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాం. ముఖ్యంగా కౌంటింగ్ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అన్ని పార్టీలు తమ కార్యకర్తలకు సూచనలు ఇవ్వాలని నిర్ణయించాం. మేము ప్రజలకు వాస్తవాలను చెప్పాలనుకుంటున్నాం" అని ఖర్గే పేర్కొన్నారు. ఖర్గే నివాసంలో జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, తేజస్వీ యాదవ్, అరవింద్ కేజ్రీవాల్, రాఘవ్ చద్దా, చంపాయి సోరెన్ సహా పలువురు కీలక నేతలు హాజరయ్యారు. మరోవైపు.. చివరి దశలో భాగంగా రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతుండడంతో పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ ఈ భేటీకి హాజరుకాలేకపోయినట్లు తెలుస్తోంది.

# ఎగ్జిట్ పోల్స్ ఎంత వరకు నిజం..?

## అసలు ఎగ్జిట్ పోల్స్ ఏలా నిర్వహిస్తారు ▪ఎగ్జిట్ పోల్స్ ఎంత వరకు నమ్మొచ్చు..

**ముందడుగు ప్రత్యేకం:**

దేశంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసింది. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. లోక్‌సభ ఎన్నికల్లో విజయంతో వరుసగా మూడో సారి అధికారం చేపడతామని, ఈ సారి తమకు 400 సీట్లు వస్తాయని ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే చెబుతుండగా.. మరోవైపు ఇండి కూటమి కూడా తమకు ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ వస్తుందని ధీమా వ్యక్తం చేస్తుంది. ఈ క్రమంలోనే కౌంటింగ్‌కు ముందు వెలువడే ఎగ్జిట్ పోల్స్ ఏం చెబుతాయనే ఉత్కంఠ నెలకొంది. అయితే ఎగ్జిట్ పోల్స్.. ఎన్నికల ఫలితాలను కచ్చితంగా ప్రతిబింబిస్తాయనే అని కూడా చెప్పలేం. ఎగ్జిట్ పోల్స్ వెలువరించే సంస్థలు.. ఒక్కో తీరుగా అంచనాలను జనం ముందు ఉంచే అవకాశం ఉంటుంది.




### ఎగ్జిట్ పోల్స్ ఎలా నిర్వహిస్తారు..?

ఎగ్జిట్ పోల్స్ నిర్వహించేందుకు ఒక ప్రత్యేక వ్యూహం అంటూ ఏమీ ఉండదు. వివిధ సంస్థలు వాటి సొంత పద్ధతి, నమూనా పరిమాణాన్ని బట్టి ఎగ్జిట్ పోల్స్ అంచనాలు వెలువరిస్తాయి. కొన్ని సంస్థలు వ్యక్తిగతంగా ఓటర్ల నుంచి అభిప్రాయాలు సేకరిస్తూ.. ఇటీవలి కాలంలో కొన్ని సంస్థలు ఆన్‌లైన్ వేదికగా పోల్స్ కండెక్ట్ చేస్తున్నాయి.

### ఎగ్జిట్ పోల్ అంటే..

ఎగ్జిట్ పోల్ అనేది పోలింగ్ ముగిసిన తర్వాత జరిపే సర్వే.. ఇది ఎన్నికలకు ముందు జరిపే సర్వే అయిన ఒపీనియన్ పోల్‌ను పోలి ఉంటుంది. అయితే ఇక్కడ ఎగ్జిట్ పోల్స్ సేకరించినవారు.. ఓటు వేసిన తర్వాత ఓటర్ల నుంచి వారు ఎవరికి ఓటు వేశారనే వివరాలను సేకరించే ప్రక్రియ. ఇలా కొన్ని శాంపిల్‌స్‌ను సేకరించి.. దానిని ఇతర అంశాలతో కూడా క్రోడీకరించి ఎగ్జిట్ పోల్స్ నిర్వహించే సంస్థలు డేటాను సిద్ధం చేస్తాయి. ఎగ్జిట్ పోల్‌ల వెనుక ఉన్న ఆలోచన ఏమిటంటే..ఓటరు పోలింగ్ కేంద్రం నుంచి బయలుదేరిన వెంటనే వారు ఎవరికి ఓటు వేశారనే వివరాలను తెలుసుకోవడం. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా ఎలాంటి ఎగ్జిట్ పోల్స్ నిర్వహించవు. భారతదేశంలో వివిధ ప్రైవేట్ ఏజెన్సీలు, టీవీ చానల్స్, మీడియా సంస్థలు ఎగ్జిట్ పోల్స్ నిర్వహిస్తాయి.

### ఎగ్జిట్ పోల్స్‌పై ఆంక్షలు..

దేశంలో ఏదైనా ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎగ్జిట్ పోల్స్ డేటాను వెలువరించేందుకు ఎన్నికల సంఘం నుంచి అనుమతి ఉండదు. వాటిని నిర్వహించడానికి సంబంధించి భారత ఎన్నికల సంఘం కొన్ని నిబంధనలను విధించింది. ఎగ్జిట్ పోల్‌ల వినియోగంపై నియంత్రణ ఎన్నికల కమిషన్‌పై ఉంటుంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రకారం..ఎగ్జిట్ పోల్స్ నిర్ణీత వ్యవధిలో మాత్రమే అనుమతించబడతాయి. పోలింగ్ ప్రక్రియ ముగిసిన 30 నిమిషాల తర్వాత ఎగ్జిట్ పోల్స్ వెలువరించేందుకు మాత్రమే ఈసీ అనుమతిస్తుంది. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు ఏడు దశల్లో జరుగుతున్న నేపథ్యంలో.. ఏప్రిల్ 19వ తేదీ ఉదయం 7.00 గంటల నుంచి జూన్ 1వ తేదీ సాయంత్రం 6.30 గంటల వరకు ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం విధించింది.

### ఎగ్జిట్ పోల్స్ విశ్వసనీయత ఎలా ఉంది..


ఇటీవలి దశాబ్దాల్లో ఎగ్జిట్ పోల్స్ భారతదేశంలో మరింత ప్రాచుర్యం పొందాయి. 1957లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఒపీనియన్ రెండవ లోక్‌సభ ఎన్నికల సమయంలో పోస్ట్ పోల్ సర్వేను నిర్వహించింది. ఇది భారతదేశంలో నిర్వహించబడిన మొట్టమొదటి ఎగ్జిట్ పోల్ అని చెబుతారు. ప్రస్తుతం ఎగ్జిట్ ఫలితాలు అనేవి ఎన్నికల ఫలితాలను అంచనా వేయడానికి విలువైన సాధనంగా పరిగణించబడుతున్నాయి. అయితే వివిధ సంస్థలు.. వివిధ పద్ధతుల ద్వారా డేటా సేకరించి ఎగ్జిట్ పోల్స్ అంచనాలు వెలువరిస్తాయి. అయితే పలు సందర్భాల్లో కొన్ని సంస్థల ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు చాలా దగ్గరగా ఉండటం జరుగుతుంది. మరికొన్ని సంస్థల ఎగ్జిట్ పోల్స్ వాస్తవ సంఖ్యలకు చాలా దూరంగా ఉంటున్నాయి. ఈ ఎగ్జిట్ పోల్స్ ఖచ్చితత్వం గతంలో ఆయా ఎన్నికల్లో ఆయా సంస్థలు వెల్లడించిన ఎగ్జిట్ పోల్స్‌పై ఆధారపడి ఉంటుంది. ఎగ్జిట్ పోల్‌లు ఏమి సూచించినా.. ఎన్నికల సంఘం అధికారికంగా ఫలితాలను ప్రకటించేదే తుది ఫలితం.

# తెలంగాణలో ఇక వానలే వానలు..!

## ఈ జిల్లాల్లో ఐదురోజులు భారీ వర్షా లు..!

**ముందడుగు**

తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ తీపికబురు చెప్పింది. రాగల ఐదురోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. శనివారం ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆదివారం ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొంది. ఉరుములు, మెరుపులు, 4050 కిలోమీటర్ల వేగంతో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. అలాగే, ఈ నెల 3 నుంచి 5 వరకు పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వివరించింది. హైదరాబాద్‌తో సహా పలు జిల్లాల్లో వానలు పడే సూచనలున్నాయని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.



ముందడుగు
ఆదివారం, 02-6-2024, హైదరాబాద్

# జై తెలంగాణ జై జై తెలంగాణ

నీళ్లు లేక నిధులు లేక చదువు లేక కొలువు లేక
గర్జించే తెలంగాణ గాండ్రించే తెలంగాణ
మన స్వప్నం తెలంగాణ మన లక్ష్యం తెలంగాణ
మన ధ్యేయం తెలంగాణ మన ప్రాణం తెలంగాణ

దగా పడిన తెలంగాణ దరువులకు సిద్ధమయ్యే
ఉవ్వెత్తున ఉప్పెనిలా ఉరుములై లేవంగా
స్త్రీ పురుషులంతా కలిసి కదనానా దూకింద్రు
ధూమ్ ధామ్ లతోటి ఉద్యమాన్ని రాజేసి

రాష్ట్ర సాధన కోసం రాజీలేని పోరు సెల్పీ
కవులు గాయకులంతా ఏకమై కదిలింద్రు
పాటలతో ఆటలతో ఉద్యమాన్ని ఊపిరి ఊది
నాలుగు కోట్ల ప్రజల నరనరాన తెలంగాణ

పల్లె నుండి పట్టణముకు తెలంగాణ పాకినది
గల్లి నుండి ఢిల్లీ దాకా జై తెలంగాణ అంటూ
సబ్బండావర్నాలు ఏకమై పోరు సల్పి
లెఫ్ట్ నుండి రైట్ వరకు ఏకమై తెలంగాణ కొరకు

కాకతీయ ఉస్మానియా రణము నకి సిద్ధమయ్యే
విద్యార్థులు ఉద్యోగులు లాయర్లు, జర్నలిస్టులు
అణగారిన గుండెలలో అగ్నిశిఖలు మండించి
రాష్ట్ర సాధన కోసం పెన్నులనే గన్ను చేసి
జర్నలిస్టులు కదిలిన్రు

మా కలిమి మా చెలిమి రాష్ట్ర సాధన అంటూ
మా మనసు మామనుగడ రాష్ట్ర సాధన అంటూ
మానేత్తూరు మాసత్తువ రాష్ట్ర సాధన అంటూ
మారోదన మా సాధన తెలంగాణ రాష్ట్రం అంటూ

దశాబ్దాల పోరాటం దరిచేరిన శుభవేళ
తెలంగాణ ఫలాలు సకల జనులకు అందాలి
కొట్లాటలు కట్టుబెట్టి కొలువులను పెంచాలి
నిరుద్యోగ సమస్యను నిర్మూలించి కథలాలి

తెలంగాణ రాగానే తెల్లారినట్టు కాదు
నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షలు తీరాలి
సకలజనులు మెచ్చేలా
ప్రజాస్వామ్య తెలంగాణ నిర్మించాలి
అమరుల ఆశయ సాధనకు పునరంకితమవుదాం




జనగాం బాబురావు,
M.SC., MED
సామాజిక ఉపాధ్యాయుడు

# పోరు తెలంగాణ నా పోరు తెలంగాణ...

నా పోరు తెలంగాణా
నా జోరు తెలంగాణ...

పొద్దుగాల పొడుచుకున్న పోరాట సింధూరం
ఇది కొట్లాడి గెలుచుకున్న కడుపుతీపుల సమరం
రాజులు రారాజులు ఏలిన నా పుణ్యభూమీ
మణులూమాణిక్యాల నా పుత్తడి పుడమీ
దగాబడ్డదీ నా తెలంగాణ
ధ్వంసించబడ్డదీ నా తెలంగాణ
కచ్చరానికి ముందటురికే
కీలు గుర్రాలమయితిమీ
బరివాత బతుకమ్మకి దరువేసే
చవట బానిసలమయితిమీ
బైరాన్పల్లి నెత్తుటి రాత్రిల
పచ్చి పీన్గులమైతిమి
పసిపోరల్ని గడ్డపారల
గుచ్చుతుంటె బొంది బొమ్మలమైతిమీ
తిరగబడ్డదీ నా తెలంగాణా
ధైర్నబడ్డదీ నా తెలంగాణ
రాళ్లని గుండ్లోలె జేసి
కొయ్యల గుత్పోలె తొలిసి
గులకల ఒడిసెలు మలిసి
ఇనుపల సలుపలు సరిసి
బండలుకండల కలిపి
చెట్టుపుట్ట తట్టి.. పలుగుపార బట్టి
ఈటెలగొడ్డల్ల సలిపి
మోగిస్తిమి గదా ఏకకాల ద్వియుద్ధపు
భేరీ
కడితిమి గదా దొరతనమిక జెల్లదని ఘోరీ
నా చాకలి అయిలమ్మ
సింగు చెక్కి కొడవలి దూసి
మా దొడ్డి కొమురయ్య
తొడగొట్టి బల్లెముల వేసి
కవులందరు కలం పట్టి
గళం విప్పి కైగట్టి

మానుల్లల్ల మార్పు తెచ్చి
మెదల్లల్ల అగ్గిరాల్చి
మొదటుద్యమ కాగడా...వెలిగిందిరా
గన్నుపెన్ను కలిసీ...కదిలిందిరా
ఏమార్చబడ్డదీ ...నా తెలంగాణా
వంచించబడ్డదీ...నా తెలంగాణా
మా మాటే ఘాటు
గుండెల్ల సుతి మెత్తని సోటూ
నమ్మితె రానియ్యము లోటు
అడిగితె పాణమిస్తము సేటూ గందుకే....



ఇటేటు రమ్మంటే...ఇల్లెక్కి గూసుండే
అన్నదమ్ములమంటే...పాలిదోపిడి జేసుండే
మా అమాయకత్వముల మేము
అమాస చందురులమయ్యుండే
నీళ్లూ నిధులన్నీ సడ్డకుని ఇల్లు జేరుతుండే
నియామకాలన్నీ మమ్ముల కూలీ హమాలీల జేస్తుండే
తెలివిలబడ్డదీ...నా తెలంగాణా

తేరుకున్నదీ...నా
తెలంగాణా
ఉడికే రక్తపు పోరలు...
మేధతో నిండిన సారులు
పల్లెగల్లీలన్నీ...ఊరువాడ
ఒక్కటయ్యి
పట్నంబస్తీలన్నీ...నగర వీధులేకమయ్యి
కదంతొక్క కదిలిందీ ...నా తెలంగాణ
సమర కాంక్షతో రగిలందీ...నా తెలంగాణ
గడప దాటిన గడుసు పోరలు
గరం గరమై కదులుతుండే
సాదిస్తేనే ఇంటిదారులు
లేకుంటే కాటిపొలిమేరలు
అగ్గిని ముద్దాడితిరీ ...నా అన్నలూ
దూలాలూయాలుగితీరి...నా తమ్ములూ
పోరల సమాధులపై...తల్లుల కన్నీటి ధారలపై
బతుకమ్మల సిబ్బిలపై...బోనాల కుండలపై
పసిపోరల మోరలపై...
ముసలవ్వల మోములపై
పురుడోసుకున్నదీ ...నా తెలంగాణా
ఫరిఢవిల్లుతున్నదీ ...నా తెలంగాణా
దశాబ్దాల దరిద్రం
శతాబ్ధాల శాపనార్థం
బద్దలయ్యి బాసింది...మా బానిసత్వం
సత్తువతో సాగుతోంది...మా నిజత్వం
అమరుల ఆశీస్సులతో...
మా తెలంగాణ నిత్యయవ్వనం
చిరంజీవిలా జరపబోవు
అమరుల దశాబ్ధాల కాలం
నిత్యం నిలిచే ఉంటుంది..
జైతెలంగాణ నినాదం
జై తెలంగాణా
జై జై తెలంగాణ



తాటి దేవివరప్రసాద్

# మన తెలంగాణ



ఇందు సహస్ర కొన్నే
కళాశాల విద్యార్థినీ

తెలంగాణ వచ్చెను మనకోసము
అమరవీరుల త్యాగాల ఫలితము
విభిన్న భాషలు, సంస్కృతులకు
కేంద్రబిందువు మన తెలంగాణ
గంగా-యమునా తెహజీబ్ గా
చరిత్రకెక్కిన ప్రాంతం మన తెలంగాణ
కవి, గాయకులకు పుట్టినిల్లు
రచయిత్రుల భావాలు వెదజల్లు
మన తెలంగాణ ముక్కోటి ప్రజల ఆశల హరివిల్లు
అరవై ఏళ్ళ పురిటి నొప్పులకు ...
పుట్టిన తెలుగు తల్లి చెల్లి
నవ తెలంగాణా తల్లి

నా తెలంగాణ పేదకొడుకుల ప్రేమగల తల్లి
ఒక్క బన్ రొట్టెను చెరిసగం తినిపిస్తుంది
తాను పస్తులున్న సంగతి
తన ప్రాణానికే తెలియనివ్వదు
కొడుకుల్ని చూస్తే చాలు ఆమె కడుపు
నిండుతుంది
వెంటాడి వేటాడితే ... మిగిలింది
ముక్కోణపు భాగము
ఎటు చూసినా ముచ్చట గొలుపు
త్రికోణమే చూపు పసికందు..దశాబ్దాం వేళా,,
మాఆటలే ఆడుతాం.. మా పాటలే పాడుతాం
జై తెలంగాణా జైజై తెలంగాణా !!